పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీమంత్రి

నరసింహా పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 21 : జిల్లా కేంద్రంలోని 16వ వార్డుకు చెందిన మధుసూదన్ తండ్రి నరసింహా ఆదివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఇంటికెళ్లి నరసింహా పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాధితుడికి పరామర్శ..

జిల్లా కేంద్రానికి చెందిన సర్దార్ ఖాన్ ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న మాజీమంత్రి సోమవారం వారి ఇంటికెళ్లి పరామర్శించారు. సర్దార్ ఖాన్‌ను ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. మాజీమంత్రి వెంట బీఆర్ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్, రమేశ్‌గౌడ్, జోహెబ్ హుస్సేన్, ఆరీఫ్, ఏకే పాషా, సాధిక్, పట్టణ ఉపాధ్యక్షుడు మోహన్, లక్ష్మణ్‌గౌడ్, శివ గౌడ్ పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్య కొనుగోలు బాధ్యత నిర్వాహకులదే

- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**

బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 21 : నిబంధనల ప్రకారం నాణ్యమైన వరికొనుగోలు చేసి ఇవ్వాల్సిన బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులదేనని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. సోమవారం కొత్తకోట, రాజపేట వరి కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వచ్చిన వడ్లు, తేమశాతం నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. వడ్లలో తాలు, గడ్డి అధికంగా కనిపించడంతో పెడస్టల్ ఫ్యాన్, పాడి క్లీనర్ ద్వారా శుభ్రం చేసి కొనుగోలు చేయాలని సెంటర్ ఇంచార్జీలను ఆదేశించారు. జిల్లాసివిల్ సప్లయి అధికారి విశ్వనాథ్, తాసీల్దార్ రమేశ్‌రెడ్డి ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

కొత్తకోట, ఏప్రిల్ 21 : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం సాయంత్రం కొత్త కోటలో కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన వడ్ల తేమశాతం నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. వడ్లలో తాలు, గడ్డి అధికంగా కనిపించడంతో పెడస్టల్ ఫ్యాన్, పాడి క్లీనర్ ద్వారా శుభ్రం చేసి కొనుగోలు చేయాలని సెంటర్ ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు.

అతిక్రమిస్తే చర్యలు

ధాన్యం నాణ్యత నిబంధనలకు విరుద్ధంగా కోతలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. వరికోతలు విస్తృతంగా కొనసాగుతున్న తరుణంలో సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో హార్వెస్టర్లు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు , మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి గోవిందునాయక్, ఆర్‌టీవో మానస, జిల్లా సివిల్ సప్లయి అధికారి విశ్వనాథ్‌పాల్గొన్నారు.

తేమతో ధాన్యం తేవాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 21 : రైతులు ధాన్యాన్ని తాలు తీయకుండా, తగిన తేమతో కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి త్వరగా లబ్ధిపొందాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం చిట్యాల మార్కెట్‌యార్డును ఆయన సందర్శించి ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీసీఎస్, మెప్మా ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

పెద్దమందడి, ఏప్రిల్ 21 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. అంకూరు, బలిజపల్లి గ్రామాలలో పీఏ సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, పెద్దమందడి, వనపర్తి మండలాల తాసీల్దార్లు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ప్రజల మన్ననలు పొందాలి

- **ఎస్పీ తోట శ్రీనివాస రావు**

మాట్లాడుతున్న ఎస్పీ తోట శ్రీనివాస రావు

గద్వాల అర్బన్, ఏప్రిల్ 21 : క్రమశిక్షణతో మెలుగుతూ ప్రజల మన్ననలు పొందేలా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ తోట శ్రీనివాసరావు హోమ్ గార్డ్‌లకు సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లానుంచి రొటేషన్ వారీగా జిల్లాకు కేటాయించిన 53మంది హోమ్ గార్డ్‌లతో ఎస్పీ గ్రీవెన్స్ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వర్తించేందుకు రొటేషన్ పద్ధతిలో మహబూబ్‌నగర్ నుంచి జిల్లాకు వచ్చిన హోమ్‌గార్డ్స్ సంక్షేమంపై ఇక్కడి పోలీస్ అధికారులు ప్రత్యేకశ్రద్ధ పెడుతారని, విధుల పరంగా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారుకార్యక్రమంలో సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు, ఆర్ఐ వెంకటేశ్, ఎస్సై విజయ్ భాస్కర్ ఉన్నారు.

గద్వాలలో ప్రజావాణి

గద్వాల అర్బన్, ఏప్రిల్ 21 : ప్రజలందరు పోలీసుల సేవలను తప్పకుండా వినియోగించుకొవాలని ఎస్పీ తోట శ్రీనివాస రావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 13ఫిర్యాదులు వచ్చాయి. వారి సమస్యలపై ఆరా తీశారు. తక్షణమే పరిష్కరించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగిలయ్య తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రజని

- **సీనియర్ సివిల్ జడ్జి రజని**

గోపాల్‌పేట, ఏప్రిల్ 21 : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లాన్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ న్యాయ మూర్తి రజని అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్ వంటి నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. పోక్సోయాక్ట్, బాల్యవివాహాల చట్టం, మోటర్ వెహికల్ చట్టం, బాలకార్మికుల చట్టం, సైబర్ నేరాలపై వివరించారు. ఉచిత న్యాయసలహా కోసం 15100 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీదేవి పాఠశాల ఇన్‌చార్జ్ జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

కొత్త కోట, ఏప్రిల్ 21 : యువతి అదృశ్యమైన సంఘటన కొత్తకోట మండలం పామాపురంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. పామాపురం గ్రామానికి చెందిన సాయిలు తన భార్యతో కలిసి పండులు కాసేవాడని అతడికి ముగ్గురు కూలుళ్లు, ఒక కొడుకు ఉన్నాడని తెలిపారు. సాయి చిన్న కూతురైన నాగమ్మ(21) చెవిటి, మూగ అమ్మాయని, ఇంట్లోనే ఉంటు టైలర్ పని చేసుకుంటు ఉండేదని అన్నారు. ఈనెల 19న తనభార్యతో కలిసి సాయిలు పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా కూతురుఇంట్లో కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా తనజాడ కనిపించక పోవడంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. సాయిలు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్ తెలిపారు.

ఐఐటీలో మాస్టర్‌ఆఫ్‌లాకు తిరుపతి ఎంపిక

గోపాల్ పేట, ఏప్రిల్ 21 : మండలంలోని పొల్కెపహాడ్ గ్రామానికి చెందిన మిట్టకడప తిరుపతి ఈనెల 19 న వెలువడిన ఐఐటీ ఖరగ్‌పూర్ ఎంట్రెన్స్ ఫలితాల్లో తెలంగాణ నుంచి ఇతడు మాస్టర్‌ఆఫ్‌లాలో క్రిమినల్ లా కోర్సుకు ఎంపిక యాడు. ప్రస్తుతం తెలంగాణ గిరిజన సంక్షేమ న్యాయ కళాశాలలో ఫైనల్ ఇయర్ 10వ సెమిస్టర్ చదువుతున్నాడు. ఇతడిది నిరుపేద వ్యవసాయ కుటుంబం పదివరకు గోపాల్ పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల, ఇటిక్యాల, జోగులాంబ గద్వాలలో చదివాడు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- **బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్**

వనపర్తిలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సంకి డ్డేపల్లిలో కార్య కర్తల సమావేశంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్

వనపర్తి టౌన్, ఏప్రిల్ 21 : ఈ నెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని చిమనగుంటపల్లి, అంకూరు, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి గులాబీ శ్రేణులను సమాయత్తంచేసి రజతోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించి గోడలపై అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని గ్రామాల్లో వచ్చే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను, ప్రజాప్రతినిధులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కుట్రలు, కుతంత్రాలు, దుష్ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇస్తామని మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాణిక్యం, సింగిల్‌విండో అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, నాయకులు రవిప్రకాష్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, శివ, లక్ష్మణ్, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సభ పోస్టర్ విడుదల

మల్దకల్, ఏప్రిల్ 21 : ఈనెల 27వ తేదీన వరంగల్ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ బాధ్యుడు బాసు హన్మంతునాయుడు ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని దాసరిపల్లి, నేతువానిపల్లి, పెద్దపల్లి, బిజ్వారం, కుర్తిరావుల చెర్వు, నీలిపల్లి గ్రామాల్లో ప్రచారం చేస్తూ పార్టీ కార్యకర్తలను సభకు తరలించేందుకు సమాయత్త పరుస్తున్నారు. కార్యక్రమంలో తిరుమలేశ్, కామేశ్, మద్దిలేటి, సల్వన్న, రంగన్న, పుణ్యమూర్తి, జనార్దన్ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేద్దాం

మదనాపురం, ఏప్రిల్ 21 : ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దామని మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. భారీ బహిరంగసభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలిరావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకట్ శ్వేర్‌రెడ్డి సూచన మేరకు సభకు వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని మండల నాయకులకు విజ్ఞప్తి చేశారు.

ఛలో వరంగల్

కొత్తకోట, ఏప్రిల్ 21 : ఈ నెల 27న జరగబోయే బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లి వేడుకల సందర్భంగా మండలంలోని సంకిరెడ్డిపల్లిలో సోమవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మాజీజెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, మాజీ సీడీసీ చైర్మన్ చెన్న కేశవ రెడ్డిహాజరయ్యారు. మాజీఎ మ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచన మేరకు అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, అధికసంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులసంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్‌అధ్యక్షుడు నెహ్రూ, ఆనంద్‌రెడ్డి, వంగూరు రాములు, గోపి, నరసింహగౌడ్, కృష్ణచారి, రాములు, కురుమూర్తి, శివ, రవి, శివకుమార్ పాల్గొన్నారు.

దాసరిపల్లిలో సభ పోస్టర్ విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మదనాపురంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

యూనిఫాం క్లాత్ పంపిణీ

ధరూరు, ఏప్రిల్ 21 : ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఈనెల 23వ తేదీన వార్షిక పరీక్షా ఫలితాలు వెల్లడించి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని ఎంఈవో రవీంద్ర బాబు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ధరూర్, కేటీదొడ్డి మండలాల హెచ్ఎంలకు సోమవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

ముందస్తు బడిబాట

అమరచింత, ఏప్రిల్ 21 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాల ఉపాధ్యాయులు వేసవి సెలవులకు ముందే అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ బడిలో తల్లిదండ్రులు తమ పిల్లలను చెర్పించాలని సోమవారం బడి బాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం కృష్ణవేణి ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు.

నమోదు శాతాన్ని పెంచాలి

పెద్దమందడి, ఏప్రిల్ 21 : వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేలా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో విష్ణు అన్నారు. సోమవారం మండల వనరుల కేంద్రంలో హెచ్ఎంల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎంల వరప్రసాదరావు, మంజులత పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

గద్వాల అర్బన్, ఏప్రిల్ 21 : వాహనంతో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గద్వాల టౌన్ ఎస్సై కల్యాణ్ పేర్కొన్నారు. ఎస్సై వివరాల మేరకు.. మండలంలోని బిజ్వారం చెందిన బోయ వెంకటన్న అనే వ్యక్తి గతనెల క్రితం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో వెళ్తున్న క్రమంలో జిల్లా కేంద్రంలోని షేరెల్లి వీధికి చెందిన మురళి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. వెంకటన్నకు తీవ్రగాయాలు అవ్వడంతో కర్నూల్‌లో మెరుగైన చికిత్స పొందాడు. అనంతరం సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకొని వాహనంతో తనను ఢీకొట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మురళిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గోపాల్ పేట, ఏప్రిల్ 21 : కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు.. మండలకేంద్రానికి చెందిన మండ్ల రాములు(35)కు 15 ఏండ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు మగపిల్లలు, ఒక కూతురుఉంది. ఇదిఇలా ఉండగా.. గత కొంత కాలంగా కుటుంబ కలహాలు, భార్యా భర్తల మధ్య తగాదాలు చోటు చేసుకోగా, భార్య తల్లి గారి ఇంటి వద్ద ఉంటుంది. దీంతోజీవితం మీద విరక్తి చెందిన రాములు సోమవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంటి పైకప్పుకు ఉరేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి మండ్లగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, పోస్టు మార్టం కోసం మృత దేహాన్ని వనపర్తి ప్రభుత్వ దవాఖానాకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఎల్కూర్‌లో మరొకరు..

మల్దకల్, ఏప్రిల్ 21 : మండలంలోని ఎల్కూర్ గ్రామంలో నీల్ల వెంకటేశ్ అనే వ్యక్తి పురుగల మందు తాగి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై నందికర్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నీల్ల వెంకటేశ్(45) ఈ నెల 17వ తేదీన ఓ పెండ్లికి వెళ్లి రాత్రి వేళ్లల్లో మద్యం కోసం తాగేందుకు తన పశువుల మేత దొడ్డికి వెళ్లి తాగాడన్నారు. తిరిగి ఇంటికి వచ్చి రాత్రివేళ్లలో వాంతులు చేసుకున్నాడన్నారు. ఇది చూసిన భార్యా పద్మ ఎందుకు వాంతులు చేసుకుంటున్నావని అడగ్గా పురుగు మందు వాసన రావడంతో వెంటనే గద్వాల్ దవాఖానకు చికిత్సకు తరలించారన్నారు. పరిస్థితి విషమించడంతో కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు చికిత్స తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. భార్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తా

- **ఎమ్మెల్యే విజేయుడు**

పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజేయుడు

మానవపాడు, ఏప్రిల్ 21 : ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే విజేయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల పురోగతికి ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకొని ముందుకు నడవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో శివప్రసాద్, హెచ్ఎం విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

భూ భారతి చట్టం- రైతులకు చుట్టం

అలంపూర్/అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 21 : తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం రైతులకు చుట్టంలా ఉంటూ సకల సమస్యలకు పరిష్కార వేదికగా ఉంటుందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. సోమవారం అలంపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఫంక్షన్ హాల్లో తాసీల్దార్ మంజుల అధ్యక్షతన ఏర్పాటు చేసిన భూభారతి చట్టం-2025పై అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ బీఎం సంతోష్ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం భూభారతి చట్టం, కొత్త ఆర్‌వోర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహద పడుతుందన్నారు. అంతకుముందు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల భూ వివాదాలను పరిష్కరించి హక్కులు కల్పించేందుకే భూ భారతి చట్టం వచ్చిందన్నారు. ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులకు కొత్త చట్టంపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివారావు, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసులు,పాల్గొన్నారు.

పాత్రికేయుడికి పరామర్శ

అలంపూర్/అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 21 : ప్రమాదవశాత్తు గాయపడిన అలంపూర్ మండలానికి చెందిన విలేకరి ఎల్లయ్యను అలంపూర్ పట్టణంలో వారి ఇంటి వద్ద ఎమ్మెల్యే విజయుడు సోమవారం పరామర్శించారు.ఎమ్మెల్యే వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. క్యాతూరు గ్రామానికి చెందిన కుర్వ నడిపి మల్లయ్యకు ఆరోగ్య ఖర్చులకు గానూ రూ.1,50,000 ఎల్ వోసీప్రొసిడింగ్‌ను అందజేశారు. అనంతరం పట్టణంలోని వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయాన్ని ఎమ్మెల్యే విజయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, నరేందర్ రెడ్డి ఉన్నారు.

మతాలమధ్య చిచ్చు పెట్టడానికి కేంద్రం ప్రయత్నం

- **వక్ఫ్ బిల్లును రద్దుచేయాలని కోరుతూ ముస్లిం నాయకుల ర్యాలీ**

ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

గద్వాల, ఏప్రిల్ : కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెట్టి విభజించు పాలించు అనే విధానాన్ని అవలంభిస్తోందని వక్ఫ్‌బోర్డు సవరణల సంబంధించిన బిల్లును వెంటనే రద్దు చేయాలని ముస్లిం మత పెద్దలు డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. రాయిచూర్ రోడ్డులో ఉన్న మసీదు నుంచి ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్ వరకు చేరుకున్నది. ఈ ర్యాలీకి ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, మాజీజెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఆవాజ్ కమిటీ రాష్ట్ర నాయకులు మహ్మద్ అబ్బాస్, జబ్బార్, మాజీ మున్సిపల్ చైర్మన్ కేశవ్, బీఆర్ఎస్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, పల్లయ్య పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు ముస్లిం మత పెద్దలు మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో ఇసాక్, అతికూర్ రహేమాన్, బాబర్, మక్బూల్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఈదురు గాలులకు..రాలిన మామిడి

గోపాల్‌పేటలో రాలిన మామిడికాయలు

గోపాల్ పేట, ఏప్రిల్ 21 : గోపాల్‌పేల, ఏదుల మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన బలమైన ఈదురుగాలులకు 100ఎకరాల్లో మామిడి పంట దెబ్బతింది. గోపాల్ పేటలో గంట అనీల్‌రెడ్డికి చెందిన 8ఎకరాల్లో మామిడిపంట పూర్తిగా దెబ్బతింది. రూ.6నుంచి రూ.7లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఉద్యానవనశాఖ అధికారి శ్రీకాంత్ తెలిపారు. అదేవిధంగా అక్కడక్కడ ఈదురుగాలులకు చెట్లు పడిపోగా, షెడ్లరేకులు ఎగిరిపడ్డాయి. బుద్దారంలో గాలులకు సుంచికాల సత్యంరావుకు సంబంధించిన గేదెల షెడ్ రేకులు ఊడిపడ్డాయి.

రామాపురంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

పాన్‌గల్‌లో వడగండ్లు

పాన్‌గల్, ఏప్రిల్ 21 : మండలంలోని తెల్లరాళ్ల పల్లిలో ఆదివారం కురిసిన వడగండ్ల వానకు మామిడి కాయలు రాలడంతో మామిడి రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వ్యవసాయ, ఉద్యాన వనశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న మామిడి పంటను పరిశీలించారు.

గాలులకు కూలిన చెట్లు

వడ్డేపల్లి, ఏప్రిల్ 21 : మండలంలో ఆదివారం రాత్రి వీచిన బలమైన గాలులకు చెట్లు నేలకొరిగాయి. దీంతో కొన్ని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం నెలకొన్నది. రామాపురం ప్రభుత్వ పాఠశాలలోని ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్లు నేలకొరిగాయి. విద్యార్థులు లేనందున ప్రమాదం తప్పింది.

బీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- **బీఆర్ఎస్ నాయకుడు హన్మంత్ నాయుడు**

గద్వాల అర్బన్, ఏప్రిల్ 21 : బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకుడు బాసు హన్మంత్ నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన వివిధ రాజకీయ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి హన్మంత్ నాయుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ క్రమంలో హన్మంత్ నాయుడు మాట్లాడుతూ.. బీ